క్లుప్తంగా

రేషన్ సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు



తిరువూరు: జూన్ 1 నుంచి చౌకధరల దుకాణాల్లోనే రేషన్ సరుకుల పంపిణీ చేయనున్నందున డీలర్లు కార్డుదారులకు ఇబ్బంది కలిగించవద్దని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి ఆదేశించారు. తిరువూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో రేషన్ స్టాకు వివరాలను ఆర్డీఓ శుక్రవారం పరిశీలించారు. అన్ని దుకాణాలకూ కేటాయించిన రేషన్ సరుకులను వెంటనే రవాణా చేయాలని, దుకాణాల్లో ఈపోస్ మిషన్లు, ఎలక్ట్రానిక్ కాటాలను డీలర్లు సిద్ధం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పీడీఎస్ డీటీ శ్వేతను ఆదేశించారు.

అటవీ భూముల పరిశీలన



తిరువూరు: ఎ.కొండూరు మండలంలోని చీమలపాడులో నిరుపయోగంగా ఉన్న అటవీ భూములను తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి అటవీ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజావసరాల నిమిత్తం 748 రీ సర్వే నంబర్‌లో సుమారు 10 ఎకరాల భూమిని గుర్తించారు. విద్యా సంస్థల ఏర్పాటుకు ఈ భూమి ఉపయుక్తంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది.

విత్తన దుకాణాల తనిఖీ



తిరువూరు: పట్టణంలోని విత్తన దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కెనడీ తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను తనిఖీ చేసి దుకాణదారులకు పలు సూచనలిచ్చారు. స్టాక్ బోర్డులో విత్తనాల వివరాలు, అమ్మకపు ధర, నిల్వ సూచికలను నమోదు చేయాలని, ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని విత్తన డీలర్లను ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నాసిరకం విత్తనాలను విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న ఆర్అండ్‌బీ రోడ్లు



చాట్రాయి: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు చెరువులను తలపిస్తున్నాయి ఆర్అండ్‌బీ రోడ్లు. మండలంలోని పర్వాపురం చిన్నంపేట గ్రామాల్లో ఆర్అండ్‌బీ రోడ్లపై పడిన గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మూడు నెలల కిందట ఈ గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేపట్టినా అక్కడక్కడ పెద్ద పెద్ద గుంతలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతల్లో నీరు నిలిచిపోతోంది. పర్వాతాపురం, చొప్పరగూడెం మధ్య నల్లవాగు కాల్వపై నిర్మించిన కల్వర్టు పల్లంగా ఉండటంతో నీరు నిలిచి ప్రయాణాలకు ఇబ్బందిగా మారుతోందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

160 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి షాబూఖారీ మసీదు వద్ద మ్యాక్సి విజన్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. కంప్యూటర్ పరిజ్ఞానంతో 160 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి ఉచితంగా, కార్డులేని వారికి రాయితీపై కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యశాల వైద్యుడు అహ్మద్‌పాషా తెలిపారు. 50 శాతం రాయితీపై కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సందిపాము రవి, కరీముల్లా, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేతో సతమతం

- యోగాంధ్ర సర్వే పేరుతో ఉద్యోగులకు తిప్పలు
- లక్ష్యాలు, టెలికాన్ఫరెన్స్‌లతో తీవ్ర ఒత్తిడి
- ప్రజలకు అందని సేవలు



సర్వే చేస్తున్న సిబ్బంది

నూజివీడు: జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి గత వారం రోజుల నుంచే అధికార యంత్రాంగాన్ని ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. యోగాంధ్ర-2025 సర్వే పేరుతో సిబ్బందిని ప్రజల ఇళ్ల చుట్టూ తిప్పుతున్నారు. గత కొద్ది రోజులుగా ఉద్యోగులకు యోగాంధ్ర-2025 సర్వే తప్ప ప్రజల పనులేమీ పట్టడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు టార్గెట్‌లు ఇచ్చి మరీ ఈ సర్వేను చేయిస్తున్నారు. యోగాను ప్రతి ఒక్కరి జీవితంలో భాగం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారార్భాటంతో ముందుకు సాగుతూ అధికారులను, సిబ్బందిని ఒత్తిడికి గురి చేస్తోంది. లక్ష్యాలు సాధించేందుకు గాను రాత్రి 9 గంటలకు కూడా టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తుండటంతో క్షేత్రస్థాయిలోని ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. గత వారం రోజుల నుంచి నిరంతరం ఈ పనిలోనే ఉద్యోగులు, అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర పనులేవీ ప్రజలకు జరగడం లేదు. లక్ష్యాన్ని నిర్దేశించి దానిని పూర్తి చేయాలంటూ సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. యోగా డే రోజున యోగా చేయించడానికి గాను యోగా గురువులు, యోగా మాస్టర్స్ ట్రైనర్స్, యోగా ట్రైనర్స్‌ను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

యోగాంధ్ర-2025 సర్వే వివరాలు

మండలం	నమోదు కావాల్సిన సభ్యులు	నమోదైన సభ్యులు
నూజివీడు	73,989	32,139
నూజివీడు టౌన్	50,625	14,332
ముసునూరు	57,757	6,644
చాట్రాయి	53,543	4,889
ఆగిరిపల్లి	63,580	20,284

ఉదయం 6 గంటల నుంచే సర్వే..

పట్టణాలు, గ్రామాల్లో ఉండే సచివాలయాల్లో పని చేసే వెల్ఫేర్ సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, ఏఎన్ఎం, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది ఉదయం ఆరు గంటల నుంచే యోగాంధ్ర-2025 సర్వేను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వారు ప్రతి ఇంటిని సందర్శించి యోగా దినోత్సవంలో పాల్గొంటారా, లేదా అని తెలుసుకుంటున్నారు. ఒకవేళ పాల్గొంటే సచివాలయం వద్దా, మండల కేంద్రంలోనా, వైజాగ్‌లో నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవ సంబరాల్లోనా అని అడిగి నమోదు చేస్తున్నారు.

అన్ని శాఖల సమన్వయంతో సర్వే



యోగా ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యోగాంధ్ర సర్వేను అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా చేస్తున్నాం. లక్ష్యాన్ని పూర్తి చేసి జిల్లాలోనే ముందుండటానికి ప్రయత్నిస్తున్నాం.

– చెన్నా రాఘవేంద్రనాథ్, ఎంపీడీఓ, నూజివీడు మండలం

ఉపాధి కూలీలనూ వదలడం లేదు

ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువుల్లో, ఫీడర్ ఛానల్స్, పంట కాలువలు, సప్లయ్ చానల్స్‌లలో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ శ్రామికులను సైతం యోగాంధ్ర సర్వేలో నమోదు కావాలని చెబుతున్నారు. సర్వే చేయడానికి వచ్చే సిబ్బంది అడిగే ప్రశ్నలకు కూలీలు తమకు యోగా ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఉదయం నిద్రలేచిన దగ్గర నుంచి కూలి పనులకు వెళ్లి చెమటోడ్చి కష్టపడుతుంటే మమ్మల్ని యోగా చేయాలని అనడమేమిటని ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళలను, గృహ నిర్మాణ లబ్ధిదారులను అందరినీ దీనిలో నమోదు చేస్తున్నారు.

ఉపాధి పనులకు 2,390 మంది కూలీల హాజరు



సుంకొల్లులో చెరువు పూడిక తీసి చెరువు కట్టను బలపరుస్తున్న కూలీలు

నూజివీడు: ఉపాధి హామీ పథకం పనులకు శుక్రవారం మండల వ్యాప్తంగా 2,390 మంది కూలీలు హాజరయ్యారు. మండలంలో పంట కాల్వలు, ఫీడర్ ఛానల్స్, సప్లయ్ చానల్స్, ట్రెంచ్ కటింగ్, చెరువుల్లో పూడికతీత వంటి 52 పనులు నిర్వహిస్తుండగా ఆయా పనుల్లో కూలీలు పాల్గొంటున్నారు. అత్యధికంగా పల్లెర్లమూడిలో 8 పనులకు గాను 443 మంది కూలీలు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి మస్టర్ పరిశీలనకు గాను సచివాలయ ఉద్యోగులను ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ నియమించారు. ప్రతి మంగళవారం పంచాయతీ సెక్రటరీ, గురువారం వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీ, శుక్రవారం మహిళా సంరక్షణ కార్యదర్శులు మస్టర్‌లను, ప్రతి శనివారం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఉపాధి హామీ పథకంలో చేసిన పని తాలూకా కొలతలను వెరిఫికేషన్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

రేషన్ షాపు వద్దనే నిత్యావసర సరుకులు

చాట్రాయి: మండలంలోని ఆయా గ్రామాల రేషన్ షాపుల వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని తహసీల్దార్ ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి ఈ పథకం ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు రేషన్ సాపు వద్ద వినియోగదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారని చెప్పారు.

జాబ్‌మేళాలో 112 మందికి ఉద్యోగాలు

నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 112 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. జితేంద్రబాబు తెలిపారు. ఈ జాబ్‌మేళాను సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించేందుకు గాను ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. దీనిలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 600 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె. ప్రవీణ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్లు వి. రవిశ్యామ్, ఆర్. ఫణికుమార్, ఎస్. సునీల్‌కుమార్, కె. రాంబాబు, వి. కిశోర్, డి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో జాబ్‌మేళాను ప్రారంభించి అధికారిని వివరాలు అడుగుతున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

తిరువూరు జాబ్‌మేళాలో 42 మందికి ఉద్యోగాలు

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా జరిగింది. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి బ్రహ్మం పర్యవేక్షణలో నిర్వహించిన జాబ్‌మేళాకు 152 మంది హాజరుకాగా 42 మందిని ఆయా కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ తదితర కోర్సులు చేసిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు చెప్పారు.

గిరిజనులకు భూమి పట్టాలు ఇవ్వాలని వినతి

తిరువూరు: ఎ.కొండూరు మండలంలోని పాత కొండూరు, కుమ్మరికుంట గ్రామాల్లో 50 ఏళ్ల కిందట ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలలో భూములు సాగు చేస్తున్న గిరిజనులు, దళిత లబ్ధిదారులకు భూమి హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం అనుబంధ రైతు సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తమ భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్స్ జారీ చేయడం లేదని, తాము బ్యాంకుల్లో రుణాలు పొందడానికి, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందడానికి అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోయారు. సీపీఎం నాయకులు బి. వెంకటేశ్వరరావు, జె. వెంకటేశ్వరరావు, పి. ఆనందరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు వీధి దీపాల వెలుగులు



ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లిలో పట్టపగలు సైతం వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయి. అధికారులే ఇలా విద్యుత్ వృథా చేస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది గ్రామ పంచాయతీకి అదనపు భారమని తెలిసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త



ఆగిరిపల్లి: స్థానిక నగర బజార్‌లో మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాలు కురుస్తున్నందున దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలో పూడికపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు యోగా శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల లెవల్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో నిర్వహించాల్సిన యోగాసన కార్యక్రమాలు, పాటలు, పెయింటింగ్, స్కిట్, క్విజ్ తదితర పోటీల నిర్వహణపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సునీత శర్మ, ఎంఈఓ పుష్పలత, పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్‌కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. యోగా గురువు లంకే జనార్దన్ ఆధ్వర్యంలో మూడు విభాగాల్లో యోగాసన పోటీలు జరిగాయి. సూర్యనమస్కారాలు, యోగాసనాలు, ఆర్టిస్టిక్ యోగా పోటీల్లో విద్యార్థులు, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



ఇబ్రహీంపట్నంలో యోగాసన శిక్షణలో పాల్గొన్న ఎంపీడీఓ సునీత శర్మ, ఉద్యోగులు

రేపు సామూహిక యోగాసనాలు..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద సామూహిక యోగాసన కార్యక్రమం ఆదివారం ఉదయం 5.30 గంటలకు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామూహిక యోగా కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ ప్రజలు కూడా యోగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీసుల అదుపులో వైఎస్సార్ సీపీ కార్యకర్త

ఇబ్రహీంపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇబ్రహీంపట్నంలో జరిగిన మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో చోటుచేసుకున్న పరిణామాలపై ఇబ్రహీంపట్నం పోలీసులు వైఎస్సార్ సీపీ కార్యకర్త కనకారావును శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గుంటుపల్లి నుంచి ఇబ్రహీంపట్నం ఫెర్రీ వరకు యువకులు, కార్యకర్తలు ఉత్సాహంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ విషయాలపై ముఖ్య నాయకుల పేర్లు చెప్పాలని కనకారావుపై పోలీసులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల పేర్లు చెప్పించి కేసులు నమోదు చేసేందుకు భారీ కుట్రకు తెరతీసినట్లు కనిపిస్తోంది.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

మక్కపేట(వత్సవాయి): ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త టి.జస్వంత్‌రెడ్డి సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త జస్వంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు మూసపద్ధతిలోనే వ్యవసాయం చేయరాదన్నారు. సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం పుష్కలంగా ఉందని వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులకు తెలియజేసి వారి సూచనలను పాటించాలని కోరారు. వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను కూడా సమానంగా అభివృద్ధి చేసుకుంటే ఆర్థిక సంవృద్ధిని సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయంలో మెలకువలు అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శాస్త్రవేత్తలు బి.రాజశేఖర్‌రెడ్డి, గోపాలస్వామి, పశువైద్యాధికారి శ్రీనునాయక్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ కాటాల తనిఖీ

నందిగామటౌన్: రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రేషన్ డీలర్ల ఎలక్ట్రానిక్ కాటాల ఈపోస్‌ను ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతున్నట్లు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సులేమాన్ తెలిపారు. పట్టణంలోని ముక్కోటి మహా మండపంలో డివిజన్‌లోని రేషన్ డీలర్ల కాటాల ఆన్‌లైన్ ప్రక్రియపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని రేషన్ డీలర్‌ల కాటాలకు ఈపోస్ ఆన్‌లైన్‌తో పాటు సాంకేతిక లోపాలున్న కాటాలకు సర్వీసింగ్ చేస్తున్నామని చెప్పారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

మైలవరం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం మైలవరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ 1970లో ఆవిర్భవించిన సీఐటీయూ నాటి నుంచి నేటి వరకు కార్మికుల సమస్యలపై అవిశ్రాంత పోరాటాలు చేస్తూ కార్మిక వర్గానికి వెన్ను దన్నుగా ఉంటోందన్నారు. పోరాటాల ఫలితంగానే కార్మిక చట్టాలు సాధించుకున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 44 లేబర్ చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని, ఇవి కార్మికులకు ఉరితాడుగా మారాయన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు , 44 లేబర్ చట్టాలు అమలుకై జూలై 9న దేశ వ్యాప్తంగా జరుగనున్న కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి. జ్యోతి, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతిరావు, మారేశ్వరరావు, మార్కెట్ ముఠా నాయకులు చంటి, ప్రశాంతి, విజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మైలవరంలో సీఐటీయూ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, కార్మికులు



తిరువూరులో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న కార్మికులు

- **తిరువూరు:** సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. యూనియన్ పతాకాన్ని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షురాలు సామ్రాజ్యం ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, ఐక్యతకు సీఐటీయూ నిరంతర పోరాటం చేస్తోందని మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసేందుకు, కార్మికులకు రక్షణ కల్పించే చట్టాలను రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. సీఐటీయూ నాయకులు ఆకుల రవి, సురేష్, నాగరాజు, వెంకటేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.
- **ముసునూరు:** కార్మిక, కర్షక, ఉద్యోగ, వృత్తిదారుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ ముందంజలో నిలుస్తోందని ఆ సంఘ మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముసునూరు మండపం సెంటర్‌లో పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు నాగరాజు, అశోక్, తిరుపతిరావు, ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.